

# ఆ కథ చెప్పాలి రా

- గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు

ఉగాది పోటీలో ఎంపికైన కథ

సుమారు ఎనభై ఏళ్లున్న ఆ వితంతువు స్పృహలో లేదు. చివరి శ్వాసకు ఆమె సిద్ధంగా ఉంది. ఆ అర్ధరాత్రి వేళ ఆమె పెద్దకొడుకూ, కోడలూ, డిగ్రీ చదువుతూన్న వాళ్ల ఇద్దరు కూతుళ్లూ- నలుగురూ కలిసి, డాక్టర్ సలహా మీద, ఆమెను మోసుకొచ్చి వాకిట్లో ప్రహరీ లోపల, నేల మీద చాప వేసి, ఆపైన దర్భలు పరిచి పడుకోబెట్టారు. వృద్ధురాలికి ఉండుండి అరకొరగా తెలివి వచ్చింది. గొణుక్కుంటున్నట్లుగా ఆమె అంది, "ఆ... కథ... చెప్పాలి రా". ఆ మాటల్ని వాళ్లెవ్వరూ పట్టించుకోలేదు. ఆమెకి మళ్లీ స్పృహ తప్పింది.

★ ★ ★

అసలు, గత నాలుగురోజులుగా ఆ వృద్ధురాలికి నడిస్తే ఆయాసం, పక్క మీద కదిల్తే ఆయాసం, ప్రాణం పోతున్నట్లుగా ముందుకు వంగి గాలి పీల్చటం, మధ్యలో విపరీతంగా దగ్గొచ్చి రక్తం కలిసిన కళ్లె పడటం వచ్చిన జ్వరం నిలబడిపోవటం- అవుతూ వచ్చింది. గత పగలంతా ఇది మరీ.

. మరీ ఎక్కువైపోయింది. డాక్టర్ వచ్చి చూసి, "ఊపిరి తిత్తులు బాగా పాడయిపోయాయి. 24 గంటలు గడిస్తేనే గాని ఏ విషయమూ చెప్పలేం... ఎందుకైనా మంచిది. మీ వాళ్లందరికీ కబురు చేసుకోండి. మీ ఏర్పాట్లల్లో ఉండండి." అన్నాడు. ఆమె పెద్దకొడుకు అందరికీ ఫోన్లు చేసాడు.

అస్సాంలో బాంకు ఉద్యోగం చేస్తున్న అతని ఒకే ఒక తమ్ముడు, తనకు సెలవు దొరకటం కష్టమనీ, అయినా ప్రయత్నిస్తాననీ చెప్పాడు. ఈ ఇద్దరు అన్నదమ్ముల మధ్యలో ఉన్న అయిదుగురు అప్పచెల్లెళ్లూ చుట్టుపక్కల ఊళ్లల్లో ఉన్నవాళ్లే కనక తాము వచ్చేస్తున్నామని చెప్పారు.

అర్ధరాత్రికి ఆవిడకి స్పృహ తప్పేసరికి ఇంట్లో ఉన్న ఆ నలుగురూ ఆ వృద్ధురాలిని తీసుకొచ్చి బయట దర్భల మీద భూశయనం చేసారు.

★ ★ ★

ఇప్పుడు తెల్లారింది. వృద్ధురాలికి మళ్లీ స్పృహ వచ్చింది. ఆయాసం తీవ్రతా తగ్గింది. తనచుట్టూ రామనామ జపం చేస్తూన్న తన పెద్దకొడుకునూ, అయిదుగురు కూతుళ్లనూ వాళ్ల పిల్లల్నీ గుర్తుపట్టింది. చివరికి గొణిగింది, "చిన్నాడు... రాలేదుట్రా?"

పెద్ద కొడుకన్నాడు, "రాలేదమ్మా, సెలవు దొరకలేదుట..."

"సెలవు... దూరకలేదా... గౌహతి నించ... బెజవాడ... రావటానికి... ఎన్నాళ్లు...సెలవు... కావాలి రా! వాడు... వస్తే... ఆ... కథ... చెప్పాలి... వాడేమంటాడో!..."

అందరూ మొహాలు మొహాలు చూసుకున్నారు. ఆమెని తీసుకొచ్చి లోపల పడుకోబెట్టారు.

ఆ మధ్యాహ్నం డాక్టర్ వచ్చి చూసాడు. "ఈమె తిప్పుకుంది. ఇంకేం పర్వాలేదు. ఆక్సిజన్ పెట్టి ఉంచండి" అన్నాడు. మందులు రాసిచ్చాడు. తమ తమ పిల్లల్తో సహా ఆమె కూతుళ్లంతా వెళ్లిపోయారు. ఆమె క్రమంగా కోలుకొంది.

ఆమె మరికొంచెం కోలుకొని, మామూలుగానే, చేతికర్ర సాయంతో, వంగి, నెమ్మదిగా నడవటం మొదలుపెట్టింది. ఆ పెద్దకొడుకు ఆమెను అడిగాడు, "తమ్ముడొస్తే ఏదో కథ చెప్పాలన్నావుగదమ్మా, ఏమిటది?"

ఆమె నవ్వి ఊరుకొంది.

★ ★ ★

ఆర్నెల్లు గడిచాయి. ఈలోపల ఆమె చిన్న కొడుకు మాత్రం రాలేదు.

ఆ వృద్ధురాలు మళ్లీ జబ్బుకు గురైంది. ఆమెకు మూత్రం రక్తంతో కలిసి చుక్కలు చుక్కలుగా రాసాగింది. దాంతోబాటు జ్వరమూ, వికారమూ, విపరీతమైన నడుము నొప్పిన్నీను. ఆమె మళ్లీ మంచానపడ్డది.

డాక్టర్ ఆమె ఎక్స్‌రే చూసి "కుడివైపు మూత్రపిండం దెబ్బతిన్నది... మందులిస్తాను... తగ్గచ్చు... కానీ ఈమె వయస్సునుబట్టి ప్రాణాపాయం లేదని చెప్పలేను... మీ జాగర్తలో మీరుండటం మంచిది" అన్నాడు. ఆ సాయంత్రానికి ఆవిడకి నాడి అందకుండాపోయింది.

ఆవిణ్ణి మళ్లీ తీసుకెళ్లి వాకిట్లో భూశయనం చేసారు. ఆమె పెద్దకొడుకు కుటుంబం.

కానీ తెల్లవారాక మళ్లీ ఆవిడ నాడి అందింది. ఆమెని తెచ్చి లోపల పడుకోబెట్టారు. డాక్టరొచ్చి మందులిచ్చాడు.

కానీ ఆ పట్టుపట్టు పది రోజులపాటు ఆమె అసలు ఈ లోకంలో లేదు. మధ్యమధ్య ఏవో అస్పష్టమైన పలవరింతలు. శక్తివంచన లేకుండా పెద్దకొడుకు పిల్లలు సేవ చేస్తున్నారు.

ఆ వృద్ధురాలు కళ్లు తెరిచి మనుషుల్ని మళ్లీ గుర్తుపట్టిన రోజున పెద్దకొడుకు ఆమెతో అన్నాడు, "అమ్మా, బాగా గుర్తుపడుతున్నావా?... చెల్లాయిలంతా వచ్చి వెళ్లారు.నీకేం కావాలో చెప్పు. మమ్మల్ని వ్యక్తిత్వంగల వ్యక్తులుగా పెంచి పెద్దచేసావు. నీ ఋణం తీర్చుకోలేనిది. నా చేతనైనంతగా నేను నీకు సేవ చేసుకుంటున్నాను. ముఖ్యమైన దానాలన్నీ నీ చేత్తో నువ్వుచేసుకున్నావు... నా అదృష్టంకొద్దీ నా భార్య నాకు సహకరిస్తోంది... నీకింకేమైనా కోరికలున్నయ్యా?... తమ్ముడికి ఏదో చెప్పాలంటావేమిటి!"

హీనస్వరంతో వృద్ధురాలు అంది. "కోరికా... అవును... కోరిక... చిన్నాడు... ఎప్పుడు... వస్తాడో... నీకు ఇద్దరూ కూతుళ్లు. వాడికి... ఇద్దరూ... కొడుకులూను... వాణ్ణి ఒప్పించాలి... అసలు వస్తాడంటావురా?..."

"తప్పక వస్తాడమ్మా!... అసలు బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు"... ఆ కథేదో నాకు చెప్పకూడదమ్మా!"

"కాదురా... ఇప్పుడు... చెబితే... ఎవరూ... నమ్మరు... అప్పుడే... వెళ్ళిపోయేటప్పుడే... చెప్పాలి... వాడి... దగ్గర... ఆమాట... తీసుకోవాలి."

"ఏం మాట?"

"అదా... అదా... లోకంలో... ఆడపిల్లలకి... ఒక తోబుట్టువును... ఇస్తానని"

పెద్దకొడుకు నాలుగు క్షణాలాలోచించాడు. కొంచెం చిరాగ్గా అన్నాడు, "ఒక్కముక్క కూడా అర్థమవ్వలేదు."

ఆ వృద్ధురాలు తనకు మూత్రం వస్తోందని సంజ్ఞచేసింది. మనవరాలు వచ్చింది. పెద్దకొడుకు అక్కణ్ణించి లేచి వెళ్లిపోయాడు. సంభాషణ తెగిపోయింది.

క్రమంగా ఆమె మళ్లీ కోలుకొంది. పెద్దకొడుకు ఆమెను అప్పుడప్పుడు "ఏంటా కథ?" అని అడుగుతూనే ఉన్నాడు. చిరునవ్వుతో ఆమె దాటవేస్తూనే ఉంది.

★ ★ ★

ఆ వృద్ధురాలికొచ్చిన నిస్సత్తువ పూర్తిగా పూడే లోపలే ఆమె ఎడమ చేతిలోనూ, ఎడమ వైపు భుజంలోనూ నెప్పి మొదలైంది. గదిలోంచి దొడ్డివైపుకు నాలుగు అడుగులు వేసేటప్పటికి ఆ నెప్పి వస్తోంది. కొంచెంసేపు కూర్చోవాలి. మళ్లీ నడక మొదలుపెట్టగానే నెప్పి! పైగా ఎగరొప్పు!... ఆమె మళ్లీ పడకేసేసింది. ఆడపిల్లలొచ్చారు.

డాక్టరొచ్చి చూసాడు. "ఇది గుండె జబ్బు. వాల్వుల్లో ఒక వాల్వు మూతబడిందేమోనని అనుమానంగా ఉంది... ఆసుపత్రికి తీసుకెళ్లటం అవసరం. ఎందుకైనా మంచిది, అన్నింటికీ సిద్ధంగా ఉండండి..." అన్నాడు.

ఆమె సంతానం ఆమెని ఆసుపత్రికి తీసికెళ్లారు. అక్కడ ఆవిడ రెండురోజులపాటు ఐ.సి.యు.లో ఉంది. మూడో రోజున అక్కడి డాక్టర్లు, "మేం చెయ్యగలిగినంతా చేసాం. ఇంత మా చేతిలో లేదు. ఆయువుంటే బతుకుతుంది. ఇంటికి తీసికెళ్లిపొండి" అన్నారు.

అంతా కలిసి ఆమెని తీసుకొచ్చి ఇంటి వాకిట్లో దర్భశయనం చేసారు. "కర్మకాండ మొదలుపెట్టటానికి ఎప్పుడు రమ్మంటే అప్పుడొస్తానని" పురోహితుడు కబురు చేసాడు.

ఆ సాయంత్రానికి ఆ వృద్ధురాలికి తెలివి వచ్చింది. అంతా ఊపిరి పీల్చుకున్నారు. తన చుట్టూ కూర్చునున్న

తన సంతానాన్నీ వాళ్ల సంతానాన్నీ ఆమె గుర్తుపట్టింది. బాగా ఆయాసపడుతూనే హీన స్వరంతో అంది, "చిన్నాడు... కనపడ్డేమే... ఆ ... కథ... వాడికి... ఎట్లా... చెప్పను... పోనీ... వాడి... కొడుకేడీ??

పెద్దకొడుకన్నాడు, "తమ్ముడు వస్తున్నాడు... వచ్చేసినట్టే... ఏం కథమ్మా, నాకు చెప్పవూ?"- ఇలా అంటూ అతను ఆమె నోటి దగ్గర తన చెవి పెట్టాడు.

వృద్ధురాలు తన కళ తప్పిన కళ్లతో అతన్ని చూసింది. అందర్నీ చూసింది. అల్లా చూస్తూండగానే ఆమెకి తెలివి తప్పింది.

డాక్టర్ వచ్చాడు అన్నాడు, "ప్రస్తుతానికి గండం తప్పింది. కానీ ఎప్పటికైనా పెద్ద గండమే. ... యాంజియోగ్రాంని చెయ్యాలి. అంటే, ఆమె తొడలోంచి రక్తనాళంలోకి, గుండె దాకా సన్నని గొట్టం పంపించాలి. ఆ తర్వాత అవసరమైతే ఆ రక్తనాళంలోకి ఆ నాళాన్ని వెడల్పుచేసే స్టెంట్‌ను పంపించాలి... దీనికంతకీ ఆవిడ తట్టుకోవాలి గదా!... ఈ సాహసం చెయ్యలేకనే ఆసుపత్రి వాళ్లు ఇంటికి పంపించేసారు... కొద్ది రోజులు ఆగండి. ఆమె తిప్పుకొని కోలుకొంటే ఇవ్వన్నీ ఆలోచిద్దాం."

ఆవిడ మళ్లీ తిప్పుకుంది. మునుపటి మీద ఓపిక తగ్గినా, మొత్తంమీద లేచి నెమ్మదిగా అటూ ఇటూ తిరుగుతోంది.

★ ★ ★

సంక్రాంతి పండగ ముందర ఆ వృద్ధురాలు తన పెద్ద కొడుకుతో, "పండక్కి బట్టలు పెట్టాలనుందిరా, అందర్నీ పిలు" అంది. భోగినాటికి ఆమె సంతానం అంతా వచ్చారు. ఆమె చిన్న కొడుకు తప్ప. ఆ ఉదయం ఆవిడ డాక్టర్ని కూడా పిలిపించింది. ఆయన ఆవిణ్ణి పరీక్ష చేసి, "అరె, మిరకిల్, అద్భుతం! ఈవిడకి ఏ రోగమూ లేదు!... మామ్మగారూ, మీరు నిండా నూరేళ్లు హాయిగా బతుకుతారు" అన్నాడు. విరక్తిగా ఓ చూపు చూసి, ఆవిడ, డాక్టరుక్కూడా బట్టలు పెట్టింది.

పండగనాటి ఉదయాన సాన్నం అయ్యాక ఆమె, విభూతి పెట్టించుకుని, వాకిటి వసారాలో, ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టు, చేతి కర్ర పట్టుకొని, కుర్చీలో కూర్చొనుంది.

హఠాత్తుగా ఆమె చిన్నకొడుకు, తన భార్య, ఇద్దరు కొడుకుల్తో చిన్న కారు దిగి హడావిడిగా బయటి నించి లోపలకొచ్చాడు.. వస్తూనే "అమ్మా, నేను వచ్చేసాను" అంటూ వెళ్లి ఆమె కాళ్ల మీద పడిపోయాడు. వృద్ధురాలు పిచ్చిదానిలాగా అతని వంక చూసి, "ఊ, వచ్చావు... నాకు తెలుసు... వస్తావని లోపలికి రండి" అంటూ లోపలికొచ్చి తన మంచంలో కూర్చుంది. చిన్నకొడుకు తన కుటుంబంతో సహా వచ్చి ఆమె కాళ్ల దగ్గర కూర్చున్నాడు.

వృద్ధురాలు అంది, "చిన్నాడా... నీకు... ఆ కథ... చెప్పాలి రా... పెద్దాడా... అమ్మాయీ... అంతా... రండి..."

ఆవిడ తన తెల్ల చీరె పమిట సర్దుకుంది. చేతి కర్రని దగ్గరికి తీసుకుంది. రెండు క్షణాల సేపు కళ్లు మూసుకుని విప్పింది. హీన స్వరంతో మాటలు తడుముకుంటూ చెప్పటం మొదలుపెట్టింది.

"అది... భయంకరమైన... రాత్రి... కాళరాత్రి... ఆ రాత్రి... ఆ రెండు గదుల... పాత ఇంట్లో... బొలారంలో... ఒక్కదాన్నే... ఉన్నాను... మీ నాన్నగారికి... మెట్టుగుడాలో... రైల్వే స్టోర్సులో... పని... ఇన్‌స్పెక్టరు... వచ్చాడని... వెళ్లారు... తెల్లారి... వస్తానని... అన్నారు. కాశిం రజ్వీ మూకలురా... రజాకార్లు... వాళ్ల... దుర్మార్గాలతో... ఊరంతా... నరక లోకమై... పోతోంది. ఎక్కడెక్కణ్ణించో... కొత్త కొత్త... మూకలు... ఊళ్లోకొచ్చి... పడుతున్నారు... వాళ్లు... మనుషులు కారు... పిశాచాలు... ఊళ్లో వాళ్ల ఇళ్ళల్లోకి... జొరబడి... తలలు... తెగేస్తున్నారు. సైడు కాలవల్లోకి... రక్తం... పారుతోంది. వయస్సులో ఉన్న ఆడవాళ్లని... జుట్టుపట్టుకుని... ఈడ్చుకెళ్లిపోతున్నారు.... అప్పుడు... నా వయస్సు... ఇరవయ్యేళ్లు... కొత్త కాపరం... ఆరోజు... నాకు... బాగా గుర్తు... 1948... సెప్టెంబరు... 13... ఆ సాయంత్రమే... ఢిల్లీ ముక్తి సైన్యం... ఊళ్లో... కవాతు జరిపింది... అందరం ... ఆనందించాం... అర్ధరాత్రి... అని... చెప్పాను గదూ... హఠాత్తుగా... మా దొడ్డి తలుపు... చప్పుడైంది... అది బద్దలైంది... లోపలకి... కత్తుల్తో... దూసుకొచ్చారు... ఇద్దరు రజాకార్లు... ఒకడు... నా చేతులు... వెనక్కి విరిచి... పట్టుకున్నాడు... ఇంకొకడు... నా మీదకి... వచ్చాడు. సగం విచ్చిన... గులాబీ రోయ్... అన్నాడు. ముందు నేను... తర్వాత నువ్వు... తర్వాత... లాహోరులో... అమ్మేద్దాం.

> **"చిన్నాడా... నీ రెండో కొడుకును... సైన్యంలో... చేర్పించు... వాడు... లోకంలో... ఆడపిల్లలందరికీ... అల్లాంటి అన్న... అవ్వాలి. ఈ లోకంలో ఆడపిల్లలకి ... నువ్వు... అల్లాంటి తోబుట్టువును... ఇయ్యి... ఇది... నా కోరిక...ఇది చెప్పాలనే... నువ్వు ఒప్పుకుంటే... వినాలనే... ఇన్నాళ్ళూ... గిలగిల్లాడాను..."**

... బోలెడు డబ్బు... అన్నాడు... ఇద్దరూ... నా మీద... పడ్డారు. వణికిపోయాను... పెనగులాడాను... నా చీరె రవికె... చించేసారు... రక్షించండి... అన్నలారా... అని... సత్తువకొద్దీ... అరిచాను... హఠాత్తుగా... వాకిలి తలుపు... బద్దలైంది... ఇద్దరు... ముక్తి సైనికులు... తుపాకుల్తో... లోపలకొచ్చారు... వాళ్లు... తుపాకులు పేల్చే లోపలే... వీళ్లల్లో ఒకడు... పిస్తోలు తీసి... పేల్చాడు... ఒక సైనికుడు... గదిలో... పడిపోయాడు... రెండో సైనికుడు... వీధిలోకి... పరిగెత్తాడు... వీళ్లిద్దరూ... వాడి వెంట....పడ్డారు. కొంచెంసేపు... పిస్తోలు, తుపాకీల... మోతలు... వినిపించాయి. నేను... స్పృహ తప్పి... అదే రక్తం మడుగులో పడిపోయాను... ఎప్పటికో... తెలివొచ్చింది.నా ఒళ్ళంతా రక్తమే... ఇంకో గంటలో... నా భర్త వస్తాడు... అందుకని... ఒళ్లంతా... నీళ్లతో... కడుక్కున్నాను... చిరిగిపోయిన... బట్టల్ని దాచాను. పాతవి... కట్టుకున్నాను... ఏడుస్తూ... ఆడదిగా ఎందుకు పుట్టానా... అని శపించుకుంటూ... బీరువా వెనకాల... నక్కి... ముడుచుకుని... కూర్చుండిపోయాను... తెల్లారి... నా భర్త... వచ్చాడు... ఆ రాక్షసులు... నిన్ను ముట్టుకోలేదు కదా... ఇంకా నయం... అన్నాడు. నేను... వాళ్లు... నన్ను... అసలు చూళ్లేదు... అని అబద్ధం... చెప్పాను. నన్ను... నగ్నంగా... చేసారనే నిజం. నేను... చెప్పలేదు. అసలు... ఎప్పటికీ... చెప్పలేదు. అబద్ధం చెప్పి... పాపమే.. చేసాను... అరవయ్యేళ్లుగా ... ఈ పాపాన్ని దాచుకోలేక... గుండె... కోతపడి... పోతోందిరా... శ్రీరామచంద్రమూర్తీ... తండ్రీ... నా దేవుడితో... అబద్ధం... చెప్పిన పాపానికి... చిన్న శిక్ష... వెయ్యి... నాయనా... పెద్ద శిక్ష... భరించలేను..." వృద్ధురాలు తన చేతులు జోడించి నమస్కారం పెట్టింది.

అందరూ మ్రాన్పడిపోయారు. ఉండండి పెద్దకొడుకు అన్నాడు, 'అబద్ధం ఎందుకూ, నిజం చెప్పెయ్యాల్సిందమ్మా... అది పెద్ద విషయమో!"

వృద్ధురాలు అంది, "మనిషన్నతర్వాత... అనుమానం... సహజం... నిజం చెప్పేస్తే... పెద్ద విషయంకాకపోయినా... నా బతుకు... ఏమయ్యేది... నిజానికి... నేను... పాడయ్యేలోపలే... ఆ సైనికుడు... అడ్డుపడ్డాడు... గుండు దెబ్బ... తిన్నాడు... తన రెండు... అరచేతులూ ... పైకెత్తి ఓ దేవుడా... నా చెల్లెల్ని... కాపాడు... అని అరుస్తూ... పడిపోయాడు... వాడు రా.... నా అన్న... నా బతుకోసం... తన రక్తం... ఇచ్చిన... అసలు అన్న..." - వృద్ధురాలు ఎండిపోయిన తన కళ్లు కొంగుతో తుడుచుకొంది.

వృద్ధురాలు మళ్లీ అందుకొంది: "చిన్నాడా... నీ రెండో కొడుకును... సైన్యంలో... చేర్పించు... వాడు... లోకంలో... ఆడపిల్లలందరికీ... అల్లాంటి అన్న... అవ్వాలి. ఈ లోకంలో ఆడపిల్లలకి ... నువ్వు... అల్లాంటి తోబుట్టువును... ఇయ్యి... ఇది... నా కోరిక...ఇది చెప్పాలనే... నువ్వు ఒప్పుకుంటే... వినాలనే... ఇన్నాళ్ళూ... గిలగిల్లాడాను..." వృద్ధురాలు ఆగింది.

రెండో కొడుకు, "అల్లాగే అమ్మా, నా రెండోవాడు ఒప్పుకుంటే నేను ఒప్పుకున్నట్టే!" అన్నాడు.

ఆ రెండోవాడు, పన్నెండేళ్లవాడు, ముందుకొచ్చాడు. ఆవేశంగా అన్నాడు: "అట్లాగే మామ్మా, నేను డాక్టరునై సైన్యంలో చేరతాను. అందరికీ అన్ననవుతాను. గాడ్ ప్రామిస్!" అన్నాడు.

కొన్ని నిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

రెండో కొడుకు అన్నాడు, "ఆ సైనికుడి పేరు గాని ప్రాంతం గాని తెలుసామ్మా?"

వృద్ధురాలి కళ్ళు మెరిసాయి. "మంచి మాట... అన్నావురా అబ్బీ" అని అంటూ తన రాములవారి పూజాపీఠం ఆ పిల్లాడి చేత తెప్పించింది. అది అర అడుగు పొడుగున్న వెండి పీఠం. ఆమె ఆ పీఠం కింద ఉన్న రహస్యపు సొరుగును బయటకు లాగింది. అందులోంచి అంగుళం చదరంలో ఉన్న చిన్న పుస్తకం బయటికి తీసింది. అంది, "నా అన్న జేబులో... ఇది కనిపిస్తే... తీసి దాచుకున్నా[నా]... నాకు తెలుసులే... ఇదేమిటో... మీరు కూడా... చూడండి" అంది.

ఆతృతగా రెండో కొడుకు దాన్ని అందుకొన్నాడు. అందరూ కూడా ఎగబడ్డారు. అతను దాని మీది పేరు చదివాడు. "అబ్దుల్ రెహ్మాన్, లాన్స్‌నాయక్, 10వ పంజాబ్ రెజిమెంట్, అమృతసర్..." - ఇట్లా చదువుతూనే అరచినట్టు అతనన్నాడు. "అమ్మా, ఇది ఖురానే!... లండనులో 1945లో అచ్చయింది!"

★ ★ ★

కాస్సేపయింతర్వాత ఆ వృద్ధురాలు పాతికేళ్ల పడుచులాగా లేచి ఇల్లంతా గునగునా తిరగసాగింది. అందర్నీ తలలు తడిమి మరీ పిలిపించింది. పండగ భోజనం చేసింది. ఇంతసేపూ ఆమె తనలో తను గొణుక్కుంటూనే ఉంది: "వాడు... ఎప్పుడో ... ఏ... తల్లికో... పుడితేనేమి... ఇప్పుడు... నాకు... తోబుట్టువు... అయ్యాడు... అందుకే... ఇంకో... తోబుట్టువును... లోకానికిచ్చి.... నేను... వాడి ఋణం... తీర్చుకున్నాను. తృప్తిగా ఉంది... శాంతిగా ఉంది... ఆనందంగా ఉంది... హాయిగా ఉంది..." ఇట్లా అంటూ చివరికి తన మంచం దగ్గరకెళ్లింది. "రామా, రామా" అంటూ విరుచుకు పడిపోయింది! హంస ఎగిరిపోయింది!!

డాక్టరొచ్చి చూసాడు. 'సెరిబ్రల్ హెమరేజ్- అదే, తలలో రక్తనాళాలు చిట్లిపోయాయి- ఉప్పొంగిన ఆనందం వల్ల! ఇంకే రోగమూ కారణం కాదు" అన్నాడు!! ★